సాక్షి
పల్నాడు
బుధవారం । 15 । మార్చి । 2023




గజేంద్ర మోక్షం అలంకారం

మంగళగిరి: ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా లక్ష్మీనృసింహస్వామి వారు మంగళవారం గజేంద్ర మోక్షం రూపంలో దర్శనమిచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,400, గరిష్ట ధర రూ.8,400, మోడల్ ధర రూ.7,400 వరకు పలికింది.



నేడు సరస్వతి యాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై బుధవారం దేవస్థాన యాగశాలలో సరస్వతి యాగాన్ని నిర్వహిస్తారు.

వైద్యవిద్య ద్విగుణీకృతం

గుంటూరు మెడికల్ కళాశాలకు మహర్దశ

రెండేళ్లు.. 66 సీట్లు

- ఒకేసారి 22 పీజీ సీట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- గత విద్యా సంవత్సరంలో 40 పీజీ సీట్లు మంజూరు
- మిగిలిన డిపార్ట్‌మెంట్లలోనూ త్వరలో భర్తీ చేసే అవకాశం
- వైద్య విద్యపై సీఎం వైఎస్ జగన్ దార్శనికతకు నిదర్శనం..
- ప్రతిభగల పేద వైద్య విద్యార్థులకు ఉచితంగా పీజీ సీట్లు
- రోగులకు మరింత నాణ్యమైన సేవలందే అవకాశం

జూబిలీ వేడుకలు జరుపుకొంటున్న వేళ వైద్య కళాశాలకు మరో తీపికబురందింది. గత ఏడాది ఒకేసారి 40 పీజీ సీట్లు మంజూరై అందరినీ ఆశ్చర్యానందంలో ముంచగా, ఆ ఆనందం నుంచి తేరుకునేలోపే ఈఏడాది అదనంగా మరో 22 సీట్లు మంజూరుకావడం విశేషంగా చెప్పుకోవచ్చు. వైద్యం, వైద్యవిద్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికత కారణంగానే గతంలో ఎన్నడూ లేనన్ని విప్లవాత్మక నిర్ణయాలు వెలువడుతుండగా, పెరిగిన సీట్లతో వైద్య విద్య మరింత బలపడి, రోగులకు మరిన్ని నాణ్యమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. – గుంటూరు మెడికల్



గుంటూరు వైద్య కళాశాలకు మహర్దశ పట్టింది. వైద్య కళాశాల ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్లాటినం జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న సమయంలో ఒకేసారి 22 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయానికి నేషనల్ మెడికల్ కమిషన్ నుంచి మెయిల్ ద్వారా ఉత్తర్వులు వచ్చాయి. గత విద్యా సంవత్సరంలో ఒకేసారి 40 పీజీ సీట్లు మంజూరు కాగా నేడు 22 పీజీ సీట్లు మంజూరవ్వటంతో వైద్య కళాశాల అధికారులు, బోధన సిబ్బంది సంబరాలు చేసుకుంటున్నారు.

ఒకేసారి 40 పీజీ సీట్లు ....

గుంటూరు వైద్య కళాశాల 75 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత విద్యా సంవత్సరం ఒకేసారి 40 పీజీ సీట్లు వైద్య కళాశాలకు మంజూరయ్యాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య కళాశాలలు, వైద్య విద్య బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో బాపట్ల, పల్నాడులో రెండు వైద్య కళాశాలలను మంజూరు చేసి వాటి నిర్మాణాల కోసం సైతం ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారు. అంతేకాకుండా ఎంతో చరిత్ర కలిగి గత పాలకుల తీరుతో మరుగున పడిపోయిన గుంటూరు వైద్య కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ పోస్టుకు అడిషనల్ డీఎంఈ హోదాను కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతోంది. వైద్య కళాశాలలో నూతనంగా హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జన్సీ మెడిసిన్, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ వైద్య విభాగాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. వైద్య విభాగాల మంజూరుతోపాటుగా వాటిల్లో బోధనా సిబ్బందిని సైతం నియమించారు. ఫలితంగా పీజీ సీట్లు కూడా కళాశాలకు మంజూరయ్యాయి.

పేద విద్యార్థులకు వరం..

ప్రతిభ కలిగిన పేద వైద్య విద్యార్థులకు గుంటూరు వైద్య కళాశాలలో పీజీ సీట్లు అందుబాటులో రావడం వల్ల ఎంతో మేలు జరుగుతోంది. ప్రైవేటు వైద్య కళాశాలల్లో సుమారు రూ.కోటి పైనే ఒక్కో పీజీ సీటుకు ఫీజులు తీసుకుంటారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో నామమాత్రపు ఫీజులతో పీజీ చదువుకునే అవకాశం లభిస్తోంది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌కు ప్రమోషన్స్ ఇవ్వటమే గాకుండా ఒక్క పోస్టు కూడా వైద్యకళాశాలలో ఖాళీ లేకుండా ఎప్పటికప్పుడు భర్తీ చేసేలా ఆదేశాలు ఇచ్చారు.

గత విద్యా సంవత్సరంలో పెరిగిన పీజీ సీట్లు

కమ్యూనిటీ మెడిసిన్‌లో మూడు, ఆర్థోపెడిక్‌లో ఎనిమిది, గైనకాలజీలో ఎనిమిది, పీడియాట్రిక్స్‌లో ఆరు, సైక్రియాట్రిలో నాలుగు, ఈఎన్‌టీలో ఒకటి, ఎనస్థీషియాలో నాలుగు, మొత్తం 34 పీజీ సీట్లు. వీటితోపాటుగా గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఒకటి, న్యూరో సర్జరీలో రెండు, ప్లాస్టిక్ సర్జరీలో మూడు, ఆరు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ఒక్క పీజీ సీటు కూడా లేని సైక్రియాట్రి డిపార్టుమెంట్‌లో నాలుగు, ప్లాస్టిక్ సర్జరీలో మూడు, గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఒక సీటు రావడం ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి, దార్శనికత వల్ల రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు బాగా పెరిగాయి. ప్రత్యేకంగా గుంటూరు వైద్య కళాశాలలో 66 పీజీ సీట్లు రెండేళ్ల కాలంలో మంజూరవడం గర్వించదగ్గ విషయం. వైద్య కళాశాల తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– డాక్టర్ చాగంటి పద్మావతి దేవి, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ఈ ఏడాది మంజూరైన పీజీ సీట్లు ..

పెథాలజీ వైద్య విభాగంలో	: 5
జనరల్ మెడిసిన్	: 13
ఎమర్జెన్సీ మెడిసిన్	: 4

మైక్రోబయాలజీ, జనరల్ సర్జరీ వైద్య విభాగాల్లో సీట్లు మంజూరు కావాల్సి ఉంది. త్వరలోనే వీటికి కూడా అనుమతి వచ్చే అవకాశాలు ఉన్నాయి. గుంటూరు వైద్య కళాశాలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో గత ఏడాది 40, ఈఏడాది 22 సీట్లు మొత్తం రెండేళ్లలో 66 సీట్లు అందుబాటులోకి వచ్చినట్లయింది.

సిద్ధమైన టెన్త్ హాల్‌టికెట్లు

విద్యాశాఖ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం

గుంటూరు ఎడ్యుకేషన్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. పరీక్షలకు 20 రోజులు ముందుగానే హాల్ టికెట్లను సిద్ధం చేసిన ప్రభుత్వ పరీక్షల విభాగం సోమవారం రాత్రి అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను జిల్లాలు, పాఠశాలల వారీగా సైట్‌లో ఉంచారు. విద్యార్థులు తమ వివరాలతో హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. అయితే విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులచే అటెస్టేషన్ చేయించుకున్న తరువాతే పరీక్షలకు హాజరు కావాల్సి ఉందని మార్గదర్శకాల్లో పొందుపర్చారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలకు గుంటూరు జిల్లాలో 456 పాఠశాలల నుంచి 27,714 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

డౌన్‌లోడ్ ఇలా...

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లోకి లాగిన్ అవ్వగానే రెగ్యులర్, ప్రైవేటు, ఓఎస్సెస్సీ, ఒకేషనల్ ఆప్షన్లు ప్రత్యక్షమవుతాయి. రెగ్యులర్‌గా పాఠశాలల విద్యార్థులు రెగ్యులర్ ఆప్షన్‌పై క్లిక్ చేసుకోవాలి. తరువాత స్క్రీన్‌పై కనిపించే హాల్‌టికెట్ డౌన్‌లోడ్ విండోను ఓపెన్ చేయాలి. అక్కడ కనిపించే పాఠశాలల జాబితాలో తమ పాఠశాలను ఎంపిక చేసుకోగానే, అక్కడ చదువుతున్న విద్యార్థుల జాబితా ప్రత్యక్షమవుతుంది. అందులో నుంచి విద్యార్థి పేరు ఎంపిక చేసుకుని, పుట్టిన తేదీ, నెల, సంవత్సరాన్ని ఎంటర్ చేసిన వెంటనే ఫొటో, వివరాలతో కూడిన హాల్ టికెట్ కనిపిస్తుంది. కింద కనిపించే డౌన్‌లోడ్ హాల్ టికెట్‌పై క్లిక్ చేయడం ద్వారా హాల్ టికెట్ పొందవచ్చు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు వెబ్‌సైట్ నుంచి నేరుగా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించడం వలన పరీక్ష కేంద్రం ఎక్కడ కేటాయించారనే సమాచారంతో పాటు వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివీ పరిశీలించుకునేందుకు వీలుంది.

న్యూస్‌రీల్

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



నరసరావుపేట రూరల్: విద్యార్థినులు రక్తహీనతకు గురికాకుండా ఆకుకూరలు, పాలు, గుడ్లు అధికంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్ సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం లింగంగుంట్ల శంకరభారతీపురం హైస్కూలులో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి.శోభారాణి, ఎంఈఓ జ్యోతికిరణ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై కసరత్తు

నరసరావుపేట రూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఆదేశాలతో మండలంలోని ఐదు పంచాయతీలు, ఎనిమిది ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికల కసరత్తును అధికారులు ప్రారంభించారు. పట్టణ శివారు ప్రాంతాలను మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియలో కొంతమంది కోర్టుకు వెళ్లడంతో మున్సిపాలిటీతో పాటు మండలంలోని కేసానుపల్లి, రావిపాడు, యల్లమంద, లింగంగుంట్ల, ఇస్సప్పాలెం పంచాయతీలు, జిల్లా పరిషత్ పరిధిలోని ఇస్సప్పాలెం, రావిపాడు-1, రావిపాడు-2, లింగంగుంట్ల-1, లింగంగుంట్ల-2, లింగంగుంట్ల-3, యల్లమంద, కేసానుపల్లి ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలు గతంలో నిలిచిపోయాయి. ఆయా గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల్లో ఓటర్ల జాబితాలు ఈనెల 21వ తేదీలోపు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి మండల అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో మండల అధికారులు వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాలను సిద్ధం చేసే పనిని ప్రారంభించారు.

నవోదయంలో 365 దరఖాస్తుల స్వీకరణ

ఇద్దరికి ఉద్యోగ నియామకపత్రాలు



నరసరావుపేట: పల్నాడు కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నవోదయం కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. కలెక్టర్, సంబంధిత అధికారులకు తమ పరిస్థితిని వివరించి జీవన ప్రగతికి తగిన సహకారం అందించాలని కోరుతూ ప్రజలు 365 దరఖాస్తులను సమర్పించగా, జిల్లా అధికారులు, బ్యాంకర్లు వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యార్థులు, యువత, మహిళలు వారికి అవసరమైన విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు కల్పించాలని కోరారు. వాటిని సచివాలయ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులకు పంపి నిశితంగా పరిశీలన చేసిన అనంతరం అర్హత కల్గినవారందరికీ తగిన సహకారం అందిస్తామంటూ భరోసా కల్పించారు. ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఇద్దరికి సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఉద్యోగాల నియామక పత్రాలను అందించారు. జిల్లా రెవెన్యూ శాఖ అధికారి కె.వినాయకం, అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయం

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కృషితోనే కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్రియ విద్యాలయం మంజూరుపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రొంపిచర్లలో కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు స్థల సేకరణ కూడా జరిగింది. అలాగే రాష్ట్రంలో 9 కేంద్రియ విద్యాలయాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వగా అందులో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాచర్ల, రొంపిచర్లలకు రెండు మంజూరు చేయడం విశేషం.

రేపు ఎంపీహెచ్ఏ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ-మేల్) లకు పునర్విభజన కౌన్సెలింగ్ ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. ఉదయం 11 గంటలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

అభాగ్యులకు ఆపన్న హస్తం

నరసరావుపేట మండలం చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డికి పది నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్స నిర్వహించారు. అయినా నడవలేని పరిస్థితుల్లో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో ఇంట్లో జరుగుబాటు ఇబ్బందిగా మారింది. వైఎస్సార్ హెల్త్ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోగా గత మూడు నెలల నుంచి ప్రతి నెలా రూ.5వేలు పెన్షన్ పొందుతున్నాడు.



ప్రమాదంలో కాళ్లు విరిగి, కదల్లేని పరిస్థితుల్లో వైఎస్సార్ హెల్త్ పెన్షన్ అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అండగా వైఎస్సార్ హెల్త్ పెన్షన్
- వ్యాధిని బట్టి నెలకు రూ.3వేలు నుంచి రూ.10వేలు
- జిల్లాలో 2వేల మంది లబ్ధిదారులు

నరసరావుపేట రూరల్: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ, మంచానికే పరిమితమై వైద్యం చేయించుకునే వారికి వైఎస్సార్ హెల్త్ పెన్షన్ ద్వారా ప్రభుత్వ ఉపశమనం కల్పిస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారిని చూసి చలించిపోయారు. కుటుంబ పెద్ద మంచానికి పరిమితం కావడంతో కుటుంబ పోషణ సైతం కష్టమైన పరిస్థితులను గమనించారు. ప్రభుత్వం ఏర్పడగానే అటువంటి వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు వైఎస్సార్ హెల్త్ పెన్షన్ పథకం అమలుచేసి వ్యాధిని బట్టి నెలకు రూ.3 వేలు నుంచి రూ.10 వేలు సాయం అందజేస్తున్నారు.

మెడికల్ బోర్డు కమిటీ ద్వారా రోగ నిర్ధారణ..

ఈ పథకం కింద పెన్షన్ పొందడానికి కొన్ని నిబంధనలు అమలు చేస్తున్నారు. తొలుత మెడికల్ బోర్డులోని కమిటీ రోగ నిర్ధారణ చేస్తారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని డాక్టర్లు సోషల్ ఆడిట్ చేసి వ్యాధి నిర్ధారణ చేసి అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని రోగులకు అందజేస్తారు. పత్రంతో పాటు రోగులకు సంబంధించిన ఆధార్, బియ్యంకార్డు, బ్యాంక్ ఖాతా పాస్ పుస్తకం తదితర వివరాలను డీఎంహెచ్ఓ కార్యాలయంలోని వైఎస్సార్ హెల్త్ పెన్షన్ విభాగంలో దరఖాస్తు అందజేయాలి. అందిన దరఖాస్తులను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు అప్‌లోడ్ చేస్తారు. అక్కడి నుంచి సెర్ప్‌కు, అక్కడినుంచి లబ్ధిదారుడు నివాసం ఉంటున్న ప్రాంతంలోని సచివాలయానికి వెళ్తుంది. సచివాలయాల ద్వారా వలంటీర్లు పెన్షన్ అందజేస్తారు.

పెన్షన్ సాయం ఇలా..

2020లో ప్రారంభమైన వైఎస్సార్ హెల్త్ పెన్షన్ పథకం ద్వారా జిల్లాలోని 2000 మంది లబ్ధిదారులు ఈ సాయాన్ని పొందుతున్నారు. కుష్ఠువ్యాధి గ్రస్తులకు రూ.3వేలు.. కిడ్నీ, లివర్, గుండెకు సంబంధించిన రోగులకు, ప్రమాదాలలో మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి.. చక్రాల కుర్చీ, మంచానికే పరిమితమైన పక్షవాతం రోగులకు, బోధకాలు ఉన్న వారికి నెలకు రూ.5వేలు పింఛన్ అందజేస్తున్నారు. థలసేమియా మేజర్, సికెల్ సెల్, సివియర్ హిమోఫిలియా ఉన్న రోగులకు నెలకు రూ.10వేలు ఇస్తున్నారు.

జిల్లాలో పెన్షన్ అందుకునే లబ్ధిదారులు

రూ.10వేలు అందుకునేవారు	: 308 మంది
నెలవారి పెన్షన్ మొత్తం	: రూ.30.80లక్షలు
రూ.5వేలు లోపు అందుకునేవారు	: 1692 మంది
నెలవారి పెన్షన్ మొత్తం	: రూ.85.69లక్షలు

అర్హులకు ప్రభుత్వం చేయూత...



దీర్ఘకాలిక అనారోగ్యం, ప్రమాదాలతో నడవలేని పరిస్థితి, సాధారణ జీవనం గడపలేని వారికి ప్రభుత్వం వైఎస్సార్ హెల్త్ పెన్షన్ ద్వారా చేయూతనిస్తుంది. వ్యాధి నిర్ధారణను సదరమ్ మెడికల్ బోర్డు పారదర్శకంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నాం. ప్రభుత్వం చేపట్టిన ఈ బృహత్తర పెన్షన్ పథకం నిజమైన రోగులకు చేరాలి.

– శోభారాణి, డీఎంహెచ్ఓ, పల్నాడు జిల్లా

నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 44 పరీక్ష కేంద్రాలు
- జిల్లా వృత్తివిద్య శాఖాధికారి నీలావతిదేవి



నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పల్నాడు జిల్లా వృత్తివిద్యా శాఖాధికారి ఎం.నీలావతిదేవి మంగళవారం తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షలు జరగనున్నాయి. పల్నాడుజిల్లా పరిధిలో 44 పరీక్ష కేంద్రాలలో 30,530 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆమె తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 14712 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 15818మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు 8.30గంటల కల్లా పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలని తెలిపారు. 9గంటల తరువాత వచ్చిన విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించమని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించామన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాలలోని అన్ని గదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల వద్ద పోలీస్ కానిస్టేబుల్, వైద్య సేవలు అందించేందుకు ఏఎన్ఎంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూసేందుకు ట్రాన్స్‌కో అధికారులతోనూ, గ్రామాలనుంచి వచ్చే విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ అధికారులతో సంప్రదించినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాలలోని ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేధించామన్నారు. విద్యార్థులు సకాలంలో హాజరై పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు.

విద్వత్తుకు వేదిక

ఏఎన్‌యూలో నేటి నుంచి అకడమిక్ ఎగ్జిబిషన్

- 160 స్టాల్స్‌లో 750కిపైగా ప్రదర్శనలు
- మూడు రోజులపాటు పలు నూతన అంశాలపై పరిశోధనలు
- ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అకడమిక్ ఎగ్జిబిషన్ బుధవారం ప్రారంభం కానుంది. 'గ్లోబల్ సైన్స్ ఫర్ ది వెల్‌బీయింగ్ ఆఫ్ హ్యూమానిటీ' అనే అంశంపై మూడు రోజులపాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగనుంది. డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలోని ట్రిపుల్ ఈ భవనంలో 160కిపైగా స్టాల్స్‌లో 750 ప్రదర్శనలు జరగనున్నాయి. వీటిలో యూనివర్సిటీలోని పలు విభాగాల నుంచి 450 ప్రదర్శనలు, యూనివర్సిటీ అనుబంధ కళాశాలలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల నుంచి 300 వరకు ప్రదర్శనలు చేయనున్నారు. ప్రదర్శనల కోసం ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రదర్శనకు హాజరయ్యే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల కోసం ఉచిత రవాణా సౌకర్యాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేశారు. సమాచారం తెలియజేసేందుకు ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. అకడమిక్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎగ్జిబిషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఆచార్య కె.మధుబాబు తెలిపారు.

సమష్టిగా విజయవంతానికి కృషి..

అకడమిక్ ఎగ్జిబిషన్ ఏర్పాట్ల కమిటీలు, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అందరూ సమష్టిగా కృషి చేసి అకడమిక్ ఎగ్జిబిషన్ విజయవంతానికి కృషి చేయాలని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ సూచించారు. ప్రదర్శనలు జరిగే ఇంజినీరింగ్ కళాశాలను మంగళవారం రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ బి.కరుణతో కలిసి వీసీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌యూతోపాటు డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రభుత్వ సంస్థలు పెద్దఎత్తున హాజరవుతున్నందున వారికి అన్ని విధాల సహకారం అందించాలని సూచించారు. ప్రారంభోత్సవ సభ బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగనుండగా, సినీ దర్శకుడు పి.రామ్‌గోపాల్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

టెండర్ల దశలో అన్నదానం, ప్రసాదాల పోటు

దుర్గ గుడి చైర్మన్ కర్నాటి రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన అభివృద్ధి పనుల్లో భాగంగా అన్నదాన భవనం, లడ్డూ ప్రసాదం పోటు పనులు టెండర్ల దశలో ఉన్నాయని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు తెలిపారు. దుర్గగుడి అభివృద్ధి పనులపై ఈఓ భ్రమరాంబ, పాలక మండలి సభ్యులతో కలసి ఆయన మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుర్గగుడి అభివృద్ధికి రూ.72 కోట్లను కేటాయించారని, వాటిలో రూ.30 కోట్లతో అన్నదాన భవనం, రూ.27 కోట్లతో ప్రసాదాల పోటు నిర్మాణానికి అంచనాలను రూపొందించామన్నారు. గత ప్రభుత్వాలు ఏవీ దుర్గగుడి అభివృద్ధికి రూపాయి ఇవ్వలేదన్నారు. నూతన పాలక మండలి ఏర్పడి నెల రోజులు గడిచిన నేపథ్యంలో తొలి సమావేశంలో తీసుకున్న పలు నిర్ణయాలు త్వరలోనే ఆచరణలోకి రానున్నాయన్నారు. కొన్ని పనులకు దేవస్థాన ఈఓ భ్రమరాంబ అంగీకారం తెలియజేయడంతో పాటు కమిషనర్ అనుమతి కోసం పంపామన్నారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి రూ.5.50 కోట్లు కేటాయించామని, జూలై నాటికి పనులు పూర్తవుతాయన్నారు. రూ.13 కోట్లతో ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుంటుందన్నారు. భక్తులకు అవసరమైన సదుపాయాలను అందించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని, భవిష్యత్తులో ఎవరూ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేయకుండా ఉండేలా జీవో తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దుర్గగుడిలో భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు భక్తులెవరైనా సూచనలు, సలహాలు ఇవ్వవచ్చునన్నారు. కేశఖండనశాలలో భక్తుల నుంచి వచ్చే ఫిర్యాదులను అధ్యయనం చేసేందుకు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. దేవస్థాన ప్రతిష్టకు భంగం కలిగించే సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. దుర్గగుడి ఈఓ భ్రమరాంబ, పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, చింకా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ- ఒకరు మృతి

మేదరమెట్ల: రెండు బైక్‌లు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన దైవాలరావూరు వంతెన సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. రావినూతల గ్రామానికి చెందిన ఓరుగంటి దత్తు శేషారావు (35) బైక్‌పై మేదరమెట్ల వస్తున్నాడు. దైవాలరావూరు వంతెన సమీపంలోకి రాగానే.. ఎదురుగా మరో బైక్‌పై దైవాలరావూరు వైపు వెళుతున్న ఇద్దరు వ్యక్తులున్న బైక్.. శేషారావు బైక్‌ను ఢీకొంది. దత్తు శేషారావు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మరో వ్యక్తిని ఒంగోలు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కొరిశపాడు ఎస్సై వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యార్డులో 1,23,262 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): స్థానిక మార్కెట్ యార్డుకు మంగళవారం 1,25,799 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,23,262 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.25,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.26,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,500 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 91,091 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పశ్చిమ కాలువకు 1416 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1416 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 160 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 20 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 130 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 820 క్యూసెక్కులు విడుదల చేశారు.

సకాలంలో వైద్యం ద్వారా టీబీ నివారణ

నరసరావుపేటరూరల్: సరైన సమయంలో మెరుగైన వైద్యం పొందడం ద్వారా క్షయ వ్యాధి(టీబీ)ని నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ శోభారాణి అన్నారు. కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హెల్త్ మేళాలో క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రధానమైన ఆరోగ్య సమస్యల్లో క్షయ వ్యాధి ఒకట్నారు. ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు జనాభా క్షయవ్యాధి బారిన పడ్డట్లు అంచనా ఉందన్నారు. క్షయ వ్యాధి అంటువ్యాధి అని, వ్యాధి సోకిన వ్యక్తితో సన్నిహితంగా ఉండటం ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందని తెలిపారు. రెండు వారాల కంటే ఎక్కువ దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలన్నారు. ఈ లక్షణాలు ఉన్న



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శోభారాణి, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి కె.పద్మావతి

వారు టీబీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య, సంరక్షణ కేంద్రంలో టీబీ డ్రగ్స్, టీబీ పరీక్షలు ఉచితంగా అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి కె.పద్మావతి, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి

నరసరావుపేటరూరల్: ఈ–క్రాప్ బుకింగ్‌లో సోషల్ ఆడిట్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళీ తెలిపారు. మండలంలోని పెదరెడ్డిపాలెంలో మంగళవారం ఆయన పర్యటించారు. రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న ఈ–క్రాప్ బుకింగ్ సోషల్ ఆడిట్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మురళి మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్ ప్రధానమైన అంశమన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మొత్తం విస్తీర్ణాన్ని ఈ–క్రాప్ బుకింగ్ చేసినట్టు తెలిపారు. రబీలో సాగుచేసిన పంట మొత్తాన్ని ఈ–క్రాప్ నమోదు చేస్తున్నట్టు వివరించారు. రైతుల వివరాలను బయోమెట్రిక్‌తో ఈకేవైసీ చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా పంట



పెదరెడ్డిపాలెంలో కంది పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

నమోదు వివరాలను జిల్లాలోని 421 రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. పంట నమోదులో వ్యత్యాసాలు ఉంటే సవరించేందుకు సోషల్ ఆడిట్ ఉపయోగపడుతుందన్నారు. సోమవారం నుంచి సోషల్ ఆడిట్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

జగనన్న భూహక్కు, భూరక్షణ సర్వే పూర్తిచేయాలి

సమీక్షలో రెవెన్యూ అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో జగనన్న భూహక్కు, భూరక్షణ పథక సర్వేను నిర్ణీత సమయంలోపు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్సు హాలు నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా రెవెన్యూ డివిజన్ అధికారులు, 28 మండలాల తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానంగా జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకం సర్వే కార్యక్రమం సకాలంలో పూర్తి చేయాలన్నారు. భూముల సర్వే హద్దు రాళ్ల ఏర్పాటు విషయంలో ఎక్కడా ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. సర్వే చేసిన భూములకు వెంటనే భూ హక్కు పత్రాల పంపిణీ చేయాలన్నారు. భూముల ఆధారంగా సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరం సర్వే చేసి ధృవీకరణ నివేదికలు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ భూములను గుర్తించి వ్యవసాయ సాగుకు అనువైన భూములను ప్రజలకు పంపిణీ నిమిత్తం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా గుర్తించడం కోసం చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కార మార్గం చూపి నివేదికలు ఇవ్వాలన్నారు. భూములను కొనుగోలు చేసిన యజమానులకు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా యాజమాన్య పత్రాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ కార్యక్రమం వెంటనే చేపట్టాలన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా రూపకల్పన, ఆధార్ కార్డుల అనుసంధానం, మార్పులు, చేర్పుల కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ. శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్డీవోలు ఎం.శేషిరెడ్డి, రాజకుమారి, అద్దయ్య, తహసీల్దార్లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాదు

ఇన్‌ఫ్లూ ఎంజా వైరస్‌పై ఫీవర్ సర్వే నిర్వహించండి

నరసరావుపేట: దేశంలో విస్తరిస్తున్న హెచ్–3ఎన్–2 ఇన్‌ఫ్లూ ఎంజా వైరస్‌పై జిల్లాలో తప్పనిసరిగా గ్రామ, వార్డు వాలంటీర్‌లను ఉపయోగించి ఫీవర్‌సర్వేను రెండువారాల్లో పూర్తిచేయాలని వైద్య, ఆరోగ్యశాఖను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలు నుంచి ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ త్వరగా చేపట్టాలన్నారు. ఆడపిల్లలకు ఎత్తుకు తగ్గ బరువు ఉండేందుకు పౌష్టికాహారం అందించాలన్నారు. బాలికలు, యువతులు, గర్భిణిలలో రక్తహీనత తగ్గించేందుకు సమస్యను గుర్తించడం, నివారణకు అందించాల్సిన పౌష్టికాహారం, మందుల పంపిణీ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతీ గ్రామంలో ప్రాథమిక తరహా వైద్య సేవలను క్షేత్రస్థాయిలో చేపట్టి అవసరమైన మందులను అందించాలని ఆదేశించారు. ఏపీఎస్ఆర్టీసీ శాఖలో ఉద్యోగం చేస్తూ ప్రభుత్వంలో కలిసిపోయిన వారు ఆకస్మికంగా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు తప్పనిసరిగా గుర్తించి, కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలకు చెత్త నుంచి సంపద తయారీ విధానానికి మ్యాపింగ్ చేయాలన్నారు. సుస్థిర అభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలను తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 16న జిల్లావ్యాప్తంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా తెలుగు భాషను ఉపయోగించి అన్ని కార్యకలాపాలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మండలాల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో బాల్య వివాహాలు నియంత్రిస్తాం

నరసరావుపేట: జిల్లాలో బాల్య వివాహాలు నియంత్రించేందుకు విద్య, వైద్యం, శిశు సంక్షేమం, గ్రామ, వార్డు సచివాలయాలు, పోలీసు శాఖలు కలసికట్టుగా సమన్వయ సహకారంతో పనిచేస్తాయని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ అతిథి గృహంలో జిల్లా బాలల సంరక్షణాధికారి విజయకుమార్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణ, కౌమార బాలికల సాధికారతపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ వచ్చే రెండు నెలల కాలంలో జిల్లాలోని అన్నిశాఖల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక తయారు చేశామన్నారు. యూనిసెఫ్ ప్రతినిధులు మేరీజోన్స్, డేవిడ్, కృష్ణవేణి వివిధ శాఖల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

తాళం వేసిన గృహంలో చోరీ

సంతమాగులూరు(అద్దంకి): తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి నగదు దోచుకెళ్లిన సంఘటన మండలంలోని వెల్లలచెరువులో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లాకు చెందిన జి.నాగిరెడ్డి కుటుంబం గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేయడం కోసం వెల్లలచెరువులో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. భార్యాభర్తలు ఇరువురూ ప్రతి రోజూ ఉదయం 5 గంటలకు ఫ్యాక్టరీకి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుంటారు. ఈ క్రమంలో రోజులాగే మంగళవారం ఉదయం వెళ్లారు. తిరిగి సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా, తలుపుకు వేసిన తాళం పగులగొట్టి ఉండటం, బీరువాలో ఉండాల్సిన రూ.1.5 లక్షలు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గ్రహించారు. పరిసర గృహాల్లోని వారు పొలాలు వెళ్లిన తరువాత మధ్యాహ్నం 12 గంటల సమయంలో చోరీ జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

నేటి ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

- సమీక్షించిన చీఫ్ సూపరింటెండెంట్‌లు
- ఇన్విజిలేటర్‌లకు అవగాహన

మాచర్ల: పట్టణంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. అందులో భాగంగా ప్రభుత్వ ఎస్‌కెబీఆర్ కళాశాల, కృష్ణవేణి, పల్నాడు జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని పర్యవేక్షించి చీఫ్ సూపరింటెండెంట్‌గా బి.వెంకటేశ్వర్లు, చందు ఆంజనేయులు, బొల్లయ్యలను నియమించారు. డీఓలుగా రామరాజు, రోశయ్య, జనార్దన్‌లకు పర్యవేక్షణ అధికారాలిచ్చారు. మొత్తంగా మూడు పరీక్ష కేంద్రాలలో 15 రోజులలో 10వేల మంది పరీక్షలు రాయనున్నారు. ఎస్‌కెబీఆర్ డిగ్రీ కళాశాలలో 365 మంది విద్యార్థులతోపాటు ఒకేషనల్ కోర్సు విద్యార్థులతో సహా 4157 మంది పరీక్షలు రాయనున్నారు. కృష్ణవేణి ఇంటర్మీడియట్ కళాశాల 355 మంది విద్యార్థులు 12 రోజులలో 3770, పల్నాడు జూనియర్ కళాశాలలో 295 మందితో ప్రతి రోజూ పరీక్షలు రాయనుండగా మొత్తంగా 12 రోజులు 3174 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆయా చీఫ్ సూపరింటెండెంట్‌లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూడు ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలలో పరీక్షలు కొనసాగుతాయి. ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణకు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఇన్విజిలేటర్‌లకు అవగాహన కల్పిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్‌లు వెంకటేశ్వర్లు, చందు

డైట్ టెండర్లకు ఆరు దరఖాస్తులు

- టెండర్లు వేయడానికి తిప్పలే...
- డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేయని అధికారులు
- మీడియా దృష్టికి వచ్చాక హడావిడిగా బాక్స్ ఏర్పాటు

గుంటూరుమెడికల్: గుంటూరు గవర్నమెంట్ ఆసుపత్రిలో డైట్ టెండర్ల ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంగళవారం సాయంత్రం లోపు టెండర్లు దాఖలు చేయాల్సి ఉండగా, రెండుగంటలు దాటేవరకూ అసలు డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేయలేదు. టెండర్లు దాఖలు చేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లు మధ్యాహ్నం వరకూ పడిగాపులు పడ్డారు. 'సాక్షి'లో పలు మార్లు డైట్ టెండర్లు నిర్వహణ చేపట్టకుండా ఆసుపత్రి అధికారులు ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్నట్లు కథనాలు ప్రచురితమైన సంగతి తెలిసిందే. కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి 'సాక్షి' కథనాలపై స్పందించి తక్షణమే డైట్ టెండర్లు, సైకిల్ స్టాండ్ టెండర్లు, ఇతర టెండర్ల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆసుపత్రి అధికారులకు ఆదేశించారు. ఈనెల 1 నుంచి 13 వరకు ఆసుపత్రి అధికారులు డైట్ నిర్వహణకు టెండరు ఫారాలు విక్రయించే గడువు విధించారు. దరఖాస్తు ఫారం కొనుగోలు చేసేందుకు రూ.7వేలు ఫీజు నిర్ణయించారు. టెండర్లు ఆహ్వానించగా ఏడుగురు దరఖాస్తులు కొనుగోలు చేశారు. మంగళవారం నాటికి దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ముగిసింది. గడువు ముగిసే సమయానికి ఆరుగురు అభ్యర్థులు టెండరు ఫారాలు సమర్పించారు. ఒక్కో అభ్యర్థి దరఖాస్తుతోపాటు రూ.3 లక్షల డీడీసీ సమర్పించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు సమర్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాల్సిన బాక్సును మధ్యాహ్నం 2 గంటల వరకు ఆసుపత్రి అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో టెండరు దాఖలు చేసేందుకు వచ్చిన పలువురు ఎక్కడ దరఖాస్తు సమర్పించాలో తెలియక అవస్థలు పడ్డారు. విషయం మీడియా దృష్టికి వెళ్లడంతో హడావిడిగా డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేశారు. కొత్తగా ఎవరికి టెండర్లు వేసే అవకాశం ఇవ్వకుండా పాత కాంట్రాక్టర్‌ను కొనసాగించేందుకే కొందరు అధికారులు ఈ విధంగా చేస్తున్నారని టెండర్లు వేసేందుకు వచ్చిన కాంట్రాక్టర్లు ఆరోపించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, చీఫ్ డైటీషియన్ గిరిధర్‌లు టెండరు బాక్సుకు సీల్‌వేసి సంతకాలు చేశారు.

భార్యను హతమార్చిన భర్త

జె.పంగులూరు: భార్యను భర్త చంపిన ఘటన మండల పరిధిలోని రామకూరులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు మేరకు.. రామకూరు గ్రామానికి చెందిన పావులూరి సునీత (32) మంగళవారం తన ఇంటిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మంచంపై చలనం లేకుండా పడి ఉంది. చుట్టుపక్కల వారు గమనించి స్థానిక వైద్యుని వద్దకు తీసుకెళ్లగా చనిపోయినట్లు తెలిపాడు. సునీత, భర్త లక్ష్మీనారాయణ ఇద్దరూ నిత్యం గొడవలు పడుతుంటారు. గతంలో సునీత తన భర్తపై గృహ హింస కేసు పెట్టింది. అనంతరం భార్యాభర్తలు ఇద్దరూ రాజీపడి లోకాయుక్తాలో కేసు పరిష్కారం చేసుకున్నారు. కానీ భార్యపై అనుమానంతో రాత్రి సమయంలో గొంతు నులిపి చంపి పరారై ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం బయటకు వెళ్లిన లక్ష్మీనారాయణ సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. ఈ ఘటనపై ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.



రామకూరులో మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ తిరుపతిరావు

విద్యార్థిని గాయపరిచి ద్విచక్రవాహనం చోరీ

సత్తెనపల్లి: విద్యార్థిని గాయపరిచి బంగారు చెయిన్, ద్విచక్రవాహనం చోరీచేసిన సంఘటన సత్తెనపల్లి మండలం బృగుబండ వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరు మండలం పెరికపాడు గ్రామానికి చెందిన కుంభా సాయి శ్రీను నరసరావుపేటలోని కేశానుపల్లి రోడ్డులో గల ఎంఏఎం కళాశాలలో ఫారం–డీ చదువుతున్నాడు. సోమవారం కళాశాలకు వెళ్లిన శ్రీను నరసరావుపేట నుంచి పెరికపాడు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై పయనమయ్యాడు. సోమవారం రాత్రి 9–10 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు దాడి చేసి మెడలోని 18 గ్రాముల బంగారు చెయిన్, పల్సర్ ద్విచక్రవాహనం బలవంతంగా అపహరించుకు పోయినట్లు సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుతో మహిళా కూలీ మృతి

సంతమాగులూరు(అద్దంకి): పాము కాటుతో మహిళా కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని ఏల్చూరు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. అంజమ్మ ఏల్చూరు గ్రామ పొలాల్లో మిరపకాయల కోతకు వెళ్లింది. కాయలు కోస్తుండగా పాముకాటు వేయడంతో మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.